# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 23-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా భారత్ ఇతర దేశాలతో చేసే వాణిజ్యం తీవ్రంగా ప్రభావితమవుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.

- ❖ దేశంలోని ప్రాధాన్యతా రంగాలకు సహజ వాయువు సరఫరా నిరాటంకంగా కొనసాగుతోందని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

- ❖ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు లోక్ సభలో ప్రవేశపెట్టిన కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లు-2026ను తదుపరి పరిశీలన నిమిత్తం సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపేందుకు సభ ఆమోదం తెలియజేసింది.

- ❖ షహీద్ దివస్ సందర్భంగా స్వాతంత్ర సమరయోధులు భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్ లకు పార్లమెంట్ ఉభయ సభలు ఈరోజు నివాళులర్పించాయి.

= = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణలు, వాటి వల్ల భారతదేశానికి ఎదురవుతున్న సవాళ్లపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు లోక్‌సభలో కీలక ప్రసంగం చేశారు. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమై మూడు వారాలు పూర్తయ్యిందని... ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా, మానవ జీవితాలపైనా ఇది తీవ్ర ప్రతికూల పరిణామాలను కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ సంక్షోభానికి వీలైనంత త్వరగా పరిష్కారం కనుగొనాలని యావత్ ప్రపంచం అన్ని పక్షాలను కోరుతోందన్నారు. ఈ ఉద్రిక్తతల కారణంగా గల్ఫ్ దేశాల్లో అనేక సమస్యలు వస్తున్నాయని, భారతదేశానికి కూడా సవాళ్లు ఎదురవుతున్నాయని చెప్పారు. యుద్ధం వల్ల ప్రభావితమైన దేశాలతో భారతదేశానికి విస్తృత వాణిజ్య సంబంధాలు ఉన్నాయని.. యుద్ధం జరుగుతున్న ప్రాంతం ప్రపంచంలోని ఇతర దేశాలతో మన వాణిజ్యానికి ఒక ముఖ్యమైన మార్గమని తెలిపారు. ఈ యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోందని నరేంద్ర మోదీ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని ప్రాధాన్యతా రంగాలకు సహజ వాయువు సరఫరా నిరాటంకంగా కొనసాగుతోందని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. పశ్చిమాసియాలోని ఇటీవలి పరిణామాలపై అంతర్-మంత్రిత్వ శాఖల పాత్రికేయుల సమావేశం న్యూ ఢిల్లీలో ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ మాట్లాడుతూ... అన్ని రిఫైనరీలు తగినంత ముడి చమురు నిల్వలతో అధిక సామర్థ్యంతో పని చేస్తున్నాయని చెప్పారు. రిఫైనరీల నుండి దేశీయ ఎల్‌పిజి ఉత్పత్తి క్రమంగా పెరుగుతోందన్నారు. ఈ నెలలో 3.5 లక్షలకు పైగా గృహ, వాణిజ్య పీఎన్‌జీ కనెక్షన్లు జారీ చేయబడ్డాయని వెల్లడించారు. తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నందువల్ల పౌరులు భయాందోళనలకు గురై కొనుగోళ్లు చేయవద్దని సూచించారు. పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులకు సరఫరాలు సుమారు 80 శాతం వద్ద నియంత్రించబడుతున్నాయని... దేశీయ PNG, CNG రవాణాకు మాత్రం నూరు శాతం సరఫరా కొనసాగుతోందని సుజాత శర్మ వివరిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

విదేశాంగ మంత్రిత్వ శాఖ (గల్ఫ్ ప్రాంత) సంయుక్త కార్యదర్శి అసీమ్ మహాజన్ మాట్లాడుతూ... ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు ఆ ప్రాంతం నుండి సుమారు 3 లక్షల 75 వేల మందిని భారతదేశానికి సురక్షితంగా తీసుకువచ్చామని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

షహీద్ దివస్ సందర్భంగా స్వాతంత్ర సమరయోధులు భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్ లకు పార్లమెంట్ ఉభయ సభలు ఈరోజు నివాళులర్పించాయి. దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్, శివరామ్ రాజ్ గురు, సుఖ్‌దేవ్ ల స్మృత్యర్థం ఏటా మార్చి 23 తేదీన `షహీద్ దివస్` పేరిట అమరవీరుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. నివాళి సందర్భంగా రాజ్య సభ ఛైర్మన్ సి. పి. రాధాకృష్ణన్ మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం కోసం వీరోచితంగా పోరాడి అత్యున్నత త్యాగం చేసిన వారి అసమాన ధైర్యం, పట్టుదల ప్రతి పౌరుడిలోనూ వారి పట్ల ప్రగాఢమైన గౌరవాన్ని, కృతజ్ఞతా భావాన్ని కలిగిస్తున్నాయన్నారు. ఇక లోక్ సభలో సభాపతి ఓం బిర్లా మాట్లాడుతూ... ఈ ధీరోదాత్తుల ధైర్యం, పరాక్రమం, తిరుగులేని దేశభక్తి స్వేచ్ఛాయుతమైన, బలమైన భారతదేశానికి పునాది వేసాయన్నారు. వారి వీరత్వానికి సంబంధించిన అమరగాథ దేశ యువతకు, యావత్ దేశానికి నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లు-2026ను లోక్ సభలో ఈరోజు ప్రవేశపెట్టారు. లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్ చట్టం-2008, కంపెనీల చట్టం-2013లను సవరించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. అయితే ఈ బిల్లును ప్రవేశపెట్టడాన్ని విపక్ష సభ్యులు మనీష్ తివారీ, సౌగత రాయ్, టి. సుమతి వ్యతిరేకించారు. ప్రతిపాదిత బిల్లు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిబంధనలను బలహీనపరుస్తుందని వారు ఆరోపించారు. వారి ఆందోళనలకు నిర్మలా సీతారామన్ బదులిస్తూ... ప్రతిపాదిత సవరణ మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా కార్పొరేట్ పాలనను కూడా సులభతరం చేస్తుందని చెప్పారు. అనంతరం.. సమగ్ర విశ్లేషణతో కూడిన తదుపరి పరిశీలన నిమిత్తం ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (JPC)కి పంపాలని నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. దీనికి సభ ఆమోదం తెలిపింది. అదే విధంగా 2026-2027 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపే ఫైనాన్స్ బిల్లు 2026 ను కూడా పరిశీలన ఆమోదం కోసం సభలో కేంద్రమంత్రి ఈరోజు ప్రవేశపెట్టారు.

= = = = = = = = = = = = = = = = = = =

రేపు ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒక సందేశం విడుదల చేశారు. క్షయవ్యాధి ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేస్తూ... ఒక ముఖ్యమైన ప్రజారోగ్య సవాలుగా కొనసాగుతోందన్నారు. అయినప్పటికీ ముందస్తు రోగ నిర్ధారణ, ఉచిత చికిత్స, పోషకాహార మద్దతును బలోపేతం చేయడం, రోగి సంరక్షణను మెరుగుపరచడంలో `టీబీ ముక్త్ భారత్ అభియాన్` గణనీయమైన పురోగతి సాధించిందని రాష్ట్రపతి ఆ సందేశంలో పేర్కొన్నారు. ఈ పురోగతి మన ఉమ్మడి సంకల్పాన్నీ, జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం బలాన్ని చాటి చెబుతోందన్నారు. క్షయవ్యాధిని శాశ్వతంగా నిర్మూలించడానికి సంబంధిత వర్గాలన్నీ సమిష్టి సంకల్పంతో కలిసి పని చేయాలని రాష్ట్రపతి విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

జల్ జీవన్ మిషన్ కింద దేశ వ్యాప్తంగా 16 కోట్లకు పైగా ఇళ్లకు కుళాయి ద్వారా రక్షిత తాగు నీటి సదుపాయాన్ని కల్పించినట్లు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `ప్రపంచ జల దినోత్సవ సదస్సు- 2026` నుద్దేశించి ఆయన ప్రసంగించారు. నీటి పరిరక్షణ, సుస్థిర నీటి నిర్వహణపై సలహాలు అందించడానికి, ఆలోచనలను పంచుకోవడానికి ఈ సదస్సు ఒక అద్భుతమైన వేదికగా ఉపయోగపడుతుందని మంత్రి పేర్కొన్నారు. “నమామి గంగే” వంటి పథకాలను కొనియాడిన ఆయన... నదీ జలాలను శుద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. దేశ పౌరులందరూ నీటిని పొదుపు చేయడం, నిల్వ చేయడం వంటి అలవాట్లను అలవర్చుకోవాలని కేంద్రమంత్రి విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

మీడియా, ప్రసార, డిజిటల్ రంగాలను బలోపేతం చేయడంతో పాటూ.. సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించాలానే లక్ష్యంతో కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మూడు ప్రధాన కార్యక్రమాలను న్యూఢిల్లీలో ఈరోజు ప్రారంభించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (IICT) ద్వారా గూగుల్, యూట్యూబ్‌ల భాగస్వామ్యంతో జాతీయ ఏఐ నైపుణ్య శిక్షణా కార్యక్రమం (నేషనల్ ఏఐ స్కిల్లింగ్ ఇనిషియేటివ్)కు శ్రీకారం చుట్టారు. అదే విధంగా వైవేవ్స్ ప్లాట్‌ఫామ్, టెలివిజన్ సెట్లలో అంతర్నిర్మిత శాటిలైట్ ట్యూనర్‌ల ఏర్పాటు, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్ ప్రోగ్రామ్ గైడ్ అనే మూడు కార్యక్రమాలు ఆరెంజ్ ఎకానమీని ప్రోత్సహించడంతో పాటూ.. ప్రభుత్వ ప్రసారాలను బలోపేతం చేయడం, మీడియా వినోద రంగంలో ఏఐ నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని నిర్మించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. వైవేవ్స్ గురించి అశ్విని వైష్ణవ్ ఈ సందర్భంగా వివరిస్తూ... కంటెంట్ సృష్టికర్తలకు ఒక శక్తివంతమైన వేదిక అని, ఇది వారికి కంటెంట్‌ను సృష్టించడానికి, అప్‌లోడ్ చేయడానికి, పంచుకోవడానికి వీలు కల్పిస్తుందని చెప్పారు.

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

రాబోయే రెండు రోజుల్లో కోస్తాంధ్ర, మధ్య మహారాష్ట్ర, మరాఠ్వాడా, ఉత్తరాఖండ్‌లలో ఉరుములు, మెరుపులతో కూడిన బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలియజేసింది.. తూర్పు రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, రాయలసీమ, ఉప హిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కింలలో కూడా ఇటువంటి పరిస్థితులు ఉండే అవకాశం ఉందని పేర్కొంది. రేపు కేరళం, మాహే, కొంకణ్ గోవాలలో వేడి తేమతో కూడిన వాతావరణ పరిస్థితులు ఉంటాయని IMD అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =